క్లుప్తంగా

శిథిలావస్థలో తహసీల్దార్ కార్యాలయం


పెచ్చులూడిన ఆర్ఐ గది

సైదాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరింది. పురాతన భవనం కావడంతో చిన్నపాటి వర్షానికే భవనం ఉరుస్తోంది. పైకప్పు పెచ్చులూడి కింద పడుతోంది. ఏ క్షణం ఏ ప్రమాదం జరుగుతుందోనని అధికారులు, ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మిగులు సీట్లకు దరఖాస్తులు

ఓజిలి: మండలంలోని చిలమానుచేను బాలుర గురుకుల పాఠశాలలో 2025–26 సంవత్సరానికిగాను 5, 6, 8 తరగతుల్లో మిగిలిన సీట్ల ప్రవేశ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ ధనరాజ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు 14వ తేదీలోపు గురుకుల పాఠశాలలో పేర్లు నమోదు చేసుకోవాలని, నమోదు చేసుకున్న విద్యార్థులకు 16వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు. 5 తరగతిలో 24, 6వ తరగతిలో 4, 8వ తరగతిలో 5 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. వివరాల కోసం 9550034491,9398040924 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం


నూతన వధూవరులతో వైఎస్సార్‌సీపీ నేతలు

సైదాపురం: నెల్లూరు జిల్లా సైదాపురం మండలం మునగపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఆర్.మాలకొండారెడ్డి తమ్ముడు చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు మహేంద్రరెడ్డి వివాహం శనివారం గూడూరులోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగింది. మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్‌యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు వరదబండి ప్రభాకర్‌రెడ్డి, మండల నేతలు రామ్‌గోపాల్‌రెడ్డి, అబ్బిరాజు, నారాయణరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు మోహన్‌రావు, శివకుమార్, చీర్ల బ్రదర్స్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

గత ప్రభుత్వ విధానాలను అమలు చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సుజాతమ్మ

దొరవారిసత్రం: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ విధానాలను అమలు చేస్తే రైతులకు, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ ఆధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేసిందని, దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు చదువుకు దూరం కాక తప్పడం లేదని వాపోయారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో తాగు నీటి సమస్య లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీఓ వీరకుమార్, ఏఓ జ్యోతిర్మయి, ఏఈలు మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, హరికృష్ణ, ఉమామహేశ్వరి, ఏపీఓ ఉషారాణి, ఏపీఎం మునిరాజా పాల్గొన్నారు.

వేడుకగా చండీ హోమం


హోమం నిర్వహిస్తున్న ఉభయకర్తలు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం చండీ హోమం నిర్వహించారు. అర్చకులు ఆలయ ఆవరణలోని మండపంలో హోమం ఏర్పాట్లు చేశారు. ముందుగా ఉభయకర్తలు గుమ్మిడిపూండికి చెందిన తోట సుధాకర్, చెల్లమ్మ అమ్మవారికి సారె సమర్పించారు. అనంతరం 13 అమ్మ వారి ప్రతిమలకు పూజలు చేసి హోమం నిర్వహించారు. ఆలయ ఈఓ నవీన్‌కుమార్ పర్యవేక్షించారు.

చికెన్ ధరలు		10.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	107
లేయర్ లైవ్	:	115
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	220
లేయర్ చికెన్	:	195

మృత్యు మలుపులు


గుర్రంకొండ వద్ద ప్రమాదకరంగా మలుపు


ముమ్మాయిపాలెం వద్ద ఎస్ ఆకారంలో మలుపు

- ప్రమాదకరంగా రోడ్డు మలుపులు
- ప్రయాణికుల భద్రత గాలికి
- తుప్పు పట్టిన సూచిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన పర్యవేక్షణ అధికారుల్లో కొరవడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతూ మృత్యువాత పడుతున్నారు. మండలంలోని పెదపరియ క్రాస్ నుంచి పెదపరియ, చిలమానుచేను, ఆర్మేనిపాడు, వజ్జవారిపాళెం, ఇనుగుంట గ్రామాలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారుల్లో మలుపులు ఎక్కువగా ఉన్నాయి. అలాగే ముమ్మాయిపాలెం, మాచవరం, కుందాం, తిరుమలపూడి గ్రామాల్లో వెళ్లే రహదారుల్లో ఈ మలుపులు ఎల్, ఎస్ ఆకారంలో ఉన్నాయి. వాహనచోదకులు ఈ మలుపుల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్లకు ఇరుపక్కల కరతుమ్మ చెట్లు ఎక్కువగా రోడ్డును కమ్మేస్తున్నాయి. ఈ క్రమంలో వాహనదారులకు ఎదురుగా వస్తున్న వాహనాలు కనపడకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.


కార్జిమేడు వద్ద తుప్పు పట్టిన సూచిక బోర్డు


పున్నేపల్లి క్రాస్ రోడ్డు వద్ద ముళ్ల చెట్లలో సూచిక బోర్డు

ఇటీవల ఆర్మేనిపాడు గ్రామం ఓ మలుపు వద్ద ద్విచక్ర వాహనం రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు విద్యార్థులు మత్యువాత పడ్డారు. రోడ్డు మలుపులు వద్ద అధికారులు 20 ఏళ్ల కిందట సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ సూచిక బోర్డులు పిచ్చి మొక్కలు కమ్మేసి తుప్పుపట్టి ఉన్నాయి. వాహనదారులకు రోడ్డు మార్గం తెలిపే బోర్డులు కనపడకపోవడంతో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఇలా వాహనచోదకులు ప్రమాదాలు బారిన పడుతున్నా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డుకు ఇరుపక్కల ఉన్న చెట్లను తొలగించి మలుపులు వద్ద కొత్త సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ


కోట ఎస్సీ గురుకుల పాఠశాలలో తమ్ముడికి రాఖీ కడుతున్న సోదరి

కోట: అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమకు ప్రతీకగా నిలిచే రాఖీ పండగను శనివారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. కోటలో దుకాణాల వద్ద రాఖీల కొనుగోళ్లతో సందడి వాతావరణం కనిపించింది. తమ సోదరులకు రాఖీలు కట్టి ఆత్మీయతను చాటుకున్నారు. కోటలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల పాఠశాలల వద్ద రాఖీ పండగ సందడి కనిపించింది. గురుకులాల్లో ఉంటున్న తమ అన్నాతమ్ముళ్లకు రాఖీలు కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన సోదరీమణులు వారితో ఆనందాన్ని పంచుకున్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేటటౌన్: రాఖీ పౌర్ణమి వేడుకలను శనివారం ఘనంగా జరుపుకున్నారు. మహిళలు వారి సోదరులకు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బ్రహ్మకుమారి ఈశ్వరాలయంకు చెందిన మహిళలు పలు ప్రాంతాలకు వెళ్లి అధికార, అనధికార ప్రముఖులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచారు.

చెంగాళమ్మ ఆలయంలో చండీ యాగం



సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా మహా చండీ యాగం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం ఆవరణలోని యాగశాలలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ చేసి వేద పండితులు వేదమంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. చెన్నైకి చెందిన కడివేటి గోపాలకృష్ణ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించి యాగాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి బి.ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

పేదల ఇళ్లను తొలగిస్తే ఆందోళన


మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

సైదాపురం: మండలంలోని చీకవోలు గిరిజన కాలనీలో పేదలకు ప్రభుత్వం 40 ఏళ్ల క్రితం ఇళ్ల స్థలాలు మంజూరుచేయడంతో పాటు పక్కా గృహాలు కూడా నిర్మించిందని, ఇప్పుడు ఇళ్లను తొలగిస్తామని అధికారులు తెలపడం దారుణమని ఆల్ ఇండియా ఎరుకుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఇట్ల వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని చీకవోలు గిరిజన కాలనీలో శనివారం ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా పేదలు ఇక్కడే కాపురాలు వుంటున్నారని తెలిపారు. ఈ క్రమంలో 100 ఇళ్లను వెంటనే ఖాళీ చేయాలని, వాటిని తొలగించాలని తహసీల్దార్ దండోరా వేయించారని పేర్కొన్నారు. నోటీసులు కూడా ఇవ్వకుండా, ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను ఎలా తొలగిస్తారని ఆయన నిలదీశారు. ఒక్క ఇంటిని కూల్చివేసినా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, కట్టా రాము, వెంకటేశ్వర్లు, మల్లి నగూరుబాబు, మల్లి చిన్న పాల్గొన్నారు.

పౌల్ట్రీ నిర్మాణ పనుల అడ్డగింత


పౌల్ట్రీ పనులను అడ్డుకుంటున్న రాజగోపాల్‌రెడ్డి

పెళ్లకూరు: చిల్లకూరులో అనుమతులు లేకుండా చేపట్టిన పౌల్ట్రీ నిర్మాణ పనులను శనివారం స్థానిక నీటి సంఘం అధ్యక్షుడు పాపాడి రాజగోపాల్‌రెడ్డి, సన్నాడి వేణురెడ్డి అడ్డుకుని నిలిపేశారు. సర్వే నంబర్ 34/2లో 0.70 సెంట్లు, సర్వే నంబర్ 34/4లో ఒక ఎకరం మొత్తం 1.70ఎకరం చెరువు పోరంబోకు భూములను ఆక్రమించి ప్రభుత్వ అనుమతులు లేకుండా పౌల్ట్రీ నిర్మాణం చేస్తున్నట్లు రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. అలాగే నీటిపారుదల శాఖ అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా చెరువుకు అడ్డంగా పౌల్ట్రీ వరకు గ్రావెల్‌రోడ్డు ఏర్పాటు చేయడం వల్ల సాగు నీటికి అనేక ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. చెరువు సమీపంలో ఉన్న మరో మూడెకరాల చెరువు భూములను కూడా పౌల్ట్రీ యాజమాన్యం కబ్జా చేసినట్లు ఆరోపించారు. పంచాయతీ పాలక వర్గం, అధికారుల అనుమతులు తీసుకోకుండా పౌల్ట్రీ నిర్మాణం ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఈవిషయమై జిల్లా కలెక్టర్‌కు, ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్నట్లు వెల్లడించారు. వీరివెంట వీఆర్వో వంశీ ఉన్నారు.

పాలక మండలి ఏర్పాటుకు నోటిఫికేషన్

చిల్లకూరు: మండలంలోని రెండు ప్రధాన ఆలయాలకు పాలక మండలి ఏర్పాటుకు దేవదాయశాఖ గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు శనివారం ఆలయ ఈఓలు తెలిపారు. తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయంతో పాటు తమ్మినపట్నంలోని కోదండరామస్వామి ఆలయానికి పాలక మండలి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇందులోభాగంగా 20 రోజుల్లో ఆలయ పాలక మండలికి సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈఓలు నవీన్‌కుమార్, గిరిక్రిష్ణ కోరారు.

కాళంగి వంతెనపై రాకపోకలు ఆపండి


మాట్లాడుతున్న సీఐ మురళీకృష్ణ

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయం సమీపంలోని కాళంగి నది వంతెన బలహీనంగా వుండడంతో శ్రీసిటీ, మాంబట్టు సెజ్‌లకు చెందిన ప్రయివేట్ కంపెనీల బస్సుల రాకపోకలను ఆపాలని సీఐ మురళీకృష్ణ సూచించారు. శనివారం బస్సు ఆపరేటర్స్, యజమానులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉదయం 7గంటల నుంచి 9 గంటల వరకు వంతెనపై ఇరువైపులా రాకపోకలను నిషేధిస్తున్నామని తెలిపారు. నిబంధనలను అతిక్రమిస్తే వెయ్యి రూపాయలు అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. శ్రీసిటి సీఐ శ్రీనివాసులు, శ్రీసిటీ సెక్యూరిటీ ఆఫీసర్ రమేష్, తడ ఎస్ఐ కొండపనాయుడు, బస్సుల యజమానులు పాల్గొన్నారు.

అప్పనంగా నేతలకు దేవస్థాన స్థలం


దేవస్థాన స్థలంలో వేస్తున్న దుకాణాలు

చిల్లకూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం దేవుడికెరుక తమ నేతల జేబులు నింపేందుకు ఏమి చేయాలని పెద్ద స్థాయి నాయకులు ఆలోచిస్తున్నారు. ఇందులో భాగంగానే గూడూరు పట్టణంలోని నడిబొడ్డులో ఉన్న ధర్మరాజుల స్వామి దేవస్థానంకు చెందిన ఆలయ భూములు ఇందుకు ఆసరాగా నిలుస్తున్నాయి. దసరా వేడుకలు గూడూరులో వైభవంగా జరుగుతాయి. అలాంటి ధర్మరాజుల దేవస్థానానికి చెందిన అర ఎకరం స్థలం ఆలయానికి ముందు భాగంలో ఉంది. అందులో దసరా సందర్భంగా అగ్నిగుండం ఏర్పాటు చేస్తారు. అటువంటి స్థలాన్ని తమ పార్టీకి చెందిన నాయకులకు కట్టబెట్టేందుకు శనివారం శ్రీకారం చుట్టారు. అనుకున్నదే తడువుగా దేవదాయశాఖ ఎలాంటి ఆదేశాలు ఇవ్వక పోయినా ఆలయ ఈఓ రవిక్రిష్ణ అప్పనంగా ఓ నాయకుడికి అంగళ్లు ఏర్పాటు చేసుకునేందుకు స్థలాన్ని అప్పగించాడు. దీంతో ఆ స్థలంలో చక చకా తాత్కాలిక అంగళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో వచ్చే ఆదాయం ఆలయానికి చేరుతుందా, నేతల జేబుల్లోకి చేరుతుందో ధర్మరాజులకే తెలియాలి. ఆ స్థలంలో 20 తాత్కాలిక అంగళ్లు ఏర్పాటు చేసుకునే అవకాశం ఉండగా వారు నెల రోజులకు కనీసం రూ.5 వేల చొప్పున చెల్లించినా లక్ష వరకు వస్తుంది, అలాంటిది రూ.20 వేలకు అప్పగించి ఆలయానికి వచ్చే ఆదాయాన్ని గండి కొట్టడం ఏమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీనిపై దేవదాయశాఖ కమిషనర్ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ విషయంపై ఆలయ ఈఓ రవిక్రిష్ణను వివరణ కోరగా గత ఆలయ పాలక మండలికి చెందిన వ్యక్తికి తాత్కాలిక అంగళ్లు ఏర్పాటు చేసుకునేందుకు నెల రోజులకు రూ.20 వేలకు ఇస్తున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



కోట: మండలంలోని కొక్కుపాడులో కొత్త అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని గ్రామస్తుల సహకారంతో చేపట్టారు. కోట తహసీల్దార్ కటారి జయజయరావు చేతులమీదుగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. దాసరి చెన్నకేశవులు, మీజూరు మాధవ్, నాగరాజు, దారా మస్తానయ్య, దాసరి సుందరం, రామక్రిష్ణ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న ఐక్యవేదిక నేతలు

కోట: భారత రాజ్యాంగం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని దళిత, బహుజన ఐక్య వేదిక నాయకులు అన్నారు. శనివారం కోటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు జరుగుతున్న రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలన్నారు. దళిత ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు, చెన్నకేశవులు, శ్రీనివాసరావు, మీజూరు మాధవ్, సుందరం, మల్లికార్జున్‌రావు పాల్గొన్నారు.

మహేష్ అభిమానుల చేయూత


వృద్ధాశ్రమంలో బిర్యానీ ఇస్తున్న నేతలు


నాయుడుపేటటౌన్: సినీ నటుడు మహేష్‌బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులు శనివారం పలుచోట్ల కేక్‌లు కట్ చేసి అనాథ పిల్లలు, వృద్ధుల ఆశ్రమాల్లోని వారికి అందజేశారు. మేరీ వృద్ధుల ఆశ్రమంలోని వారికి బిర్యానీ బాక్సులను అందజేశారు. అదేవిధంగా ఏబీవీపీకి చెందిన చందు మహేష్ అభిమానులతో కలిసి పట్టణంలో పేదలకు ఆహార ప్యాకెట్లు పంచిపెట్టారు. అభిమాన సంఘ నేతలు ఎస్ఎస్ జెమిని, పునబాక శ్రావణ్‌కుమార్, కల్యాణ్, చరణ్, మజ్ను పాల్గొన్నారు

వైభవంగా కుంకుమార్చన


విద్యుద్దీపాలంకరణలో చెంగాళమ్మ

చిట్టమూరు: ఆరూరు గ్రామంలోని చెంగాళమ్మ ఆలయ తొమ్మిదో వార్షికోత్సవంలో భాగంగా శనివారం లలితా సహస్ర నామ కుంకుమార్చనను వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి వివిధ ద్రవ్యాలతో పురోహితులు అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మ వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేసి శాస్త్రోక్తంగా సహస్ర కుంకుమార్చన నిర్వహించారు.

దుస్తుల పంపిణీ


దుస్తులు ఇస్తున్న సంఘం సభ్యులు

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని బలిజ మహిళా సంఘ కార్యాలయంలో శనివారం పేద విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. బలిజ మహిళా సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి సువర్ణలక్ష్మి మాట్లాడుతూ కాటా హిమజ పుట్టినరోజును పురస్కరించుకుని దుస్తులు ఇచ్చామన్నారు. సంఘం గౌరవాధ్యక్షురాలు సులక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

పార్కుకు నూడ పేరు పెట్టాలి


మాట్లాడుతున్న నూడ చైర్మన్

నాయుడుపేటటౌన్: పట్టణంలో శిథిలావస్థలో ఉన్న గాంధీ పార్కుకు గతంలో నూడ (నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ) చైర్మన్‌గా తాను ఉన్నప్పుడు రూ.50లక్షలతో పార్కు నిర్మాణం చేపట్టి ప్రారంభించామన్నారు. అందువల్ల నాయుడుపేట గాంధీ పార్కును నూడ పేరుతో బోర్డు పెట్టాలని నూడ చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి డిమాండ్ చేశారు. పట్టణంలో ఓ కార్యక్రమానికి హాజరైన శ్రీనివాసులురెడ్డి శనివారం గాంధీ పార్కును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్కుకు నూడ పేరు పెట్టాలని కమిషనర్‌కు ఫోన్ చేసి చెప్పినట్లు ఆయన తెలిపారు. మూడ రోజుల్లో మళ్లీ నాయుడుపేటకు వస్తానని అప్పటికీ మార్చకుంటే మేమే మార్చుతామన్నారు.

పైప్‌లైన్ ధ్వంసం


లీకవుతున్న తాగు నీరు

పెళ్లకూరు: మండలంలోని నెలబల్లి గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాలతో వాటర్ పైప్‌లైన్ ధ్వంసమైంది. దీంతో గ్రామానికి సరఫరా అవుతున్న తాగునీరు లీకై వృథా కావడంతో పాటు కలుషితమైందని స్థానికులు ఆశాఖ ఉన్నతాధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటు కోసం గ్రామంలో వీధుల వెంబడి యంత్రాలతో గోతులు తీశారు. యంత్రాల తాకిడికి పలుచోట్ల పైప్‌లైన్ మరమ్మతులకు గురైంది. దీంతో తాగునీరంతా వృథా అవుతుంది. బురదనీరు కలయికతో తాగునీరు కలుషితమవుతున్నట్లు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బైబిల్‌లో మహిళకు ప్రత్యేక స్థానం


దైవ సందేశం ఇస్తున్న బిషప్

ఓజిలి: బైబిల్‌లో మహిళకు ప్రత్యేక స్థానం ఉందని ఎస్ఏఎల్‌సీ బిషప్ రైట్ రెవరెండ్ మైఖేల్‌బాబు అన్నారు. ఓజిలిలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చిలో శనివారం తిరుపతి ఎస్ఏఎల్‌సీ 79వ స్త్రీల మహాసమాజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అనంతరం దైవసందేశం ఇచ్చారు. మాజీ బిషప్ కలపాటి ఏసుప్రసాద్, పాస్టర్లు రాజరత్నం, విజయ కుమార్, రాజేష్, సురేష్ పాల్గొన్నారు.

కమనీయం..శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఓజిలి: మండలంలోని సగుటూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీబాల అమృత మృత్యుంజయేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సం సందర్భంగా మూడవ రోజు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని ఆలయ చైర్మన్ లెక్కల మల్లికార్జున ఆధ్వర్యంలో శనివారం వేదపండితులు కమనీయంగా నిర్వహించారు. ఉదయం ఆలయ మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను తీసుకొచ్చి పండితులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. గ్రామానికి చెందిన నాదెండ్ల వెంకటేశ్వర్లు, నిర్మల దంపతులు, కన్యాధార వెంకటేశ్వర్లు, అనూష దంపతులు కల్యాణం ఉభయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం అన్నదానం చేశారు. సాయంత్రం భజన కీర్తనలు, కోలాట కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

వరికి అంతుపట్టని తెగుళ్లు

- తలకు మించిన పెట్టుబడులు
- తలలు పట్టుకుంటున్న అన్నదాతలు


పంటకు సోకిన తెగుళ్లను చూపుతున్న రైతు

వాకాడు: సాధారణంగా వరి పంటపై రెండు, మూడు రకాల తెగుళ్ల సోకడం, అందుకు తగిన మందులతో నివారించుకోవడం సహజం. ఐతే ఈ ఏడాది వాతావరణంలో వచ్చిన మార్పో లేక విత్తనాల్లో నాణ్యత లోపమో తెలియదుగాని నేడు సాగులో ఉన్న వరి పంటలపై మామూలు తెగుళ్లతోపాటు కొత్త కొత్త తెగుళ్లు సోకుతున్నాయి. దీంతో రైతులు వాటి నివారణ కోసం తలకు మించిన అప్పులు చేసి నానా రకాల పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. మండలంలో 13,500 ఎకరాల్లో 3,800 మంది రైతులు సాగు చేపట్టారు. అందులో ఎంటీయూ 1010 రకం వరిని 1,878 ఎకరాల్లో సాగు చేయగా, కేఎస్ఎం రకాల వరి 11,622 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. ఒక పక్క గత ఏడాది కాలంగా పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలు లేకపోగా మరో పక్క అంతుపట్టని తెగుళ్లతో రాబడి కన్నా పెట్టుబడులు అధికంగా పెట్టాల్సి వస్తుంది. గత రెండేళ్ల కిందట ఎకరా సాగులో రైతులు ఖర్చులు పోను ఎకరాకు రూ.70 వేల ఆదాయం కళ్లజూశారు. కానీ ఈ సారి కనీసం పెట్టిన పెట్టుబడులు రావంటూ రైతులు లబోదిబోమంటున్నారు. గత నాలుగు రోజులుగా ఎన్ను దశలో ఉన్న పంటలపై కాఫీ కలర్, పసుపు, ఎరుపు రంగులో ఓ వింత తెగుళ్లు కంటికి కనపడకుండా గింజలకు సోకి పాలు పట్టకుండా చప్పరించేస్తోంది. దీంతో కంకులు కొన్ని రోజులు మామూలుగానే ఉంటూ తరకలుగా మారిపోతున్నాయి. అలాగే కొన్ని చోట్ల నాలుగు నెలలు గడుస్తున్నా ఇంత వరకు వెన్ను దశకు రాకపోవడం గమనార్హం. ఇలా రైతులు సతమతమవుతూ తలలు పట్టుకుంటున్నారు.

కండలేరులో 25.670 టీఎంసీలు

రాపూరు: కండలేరులో శనివారం నాటికి 25.670 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 4,545 క్యూసెక్కుల నీరు ఉంటోందని తెలిపారు. గంగ 1,575,పిన్నేరు కాలువకు 20, లోలెవల్ కాలువకు 40, మొదటి బ్రాంచ్‌కు70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.